క్లుప్తంగా

శివలింగాన్ని తాకిన సూర్యకిరణాలు



ఖానాపురం : మండలంలోని ధర్మరావుపేటలో ఉన్న శివరామ క్షేత్రంలో శివలింగాన్ని సూర్యకిరణాలు శుక్రవారం ఉదయం నేరుగా తాకాయి. వసంత రుతువులో సూర్యకిరణాలు శివుడిని తాకం శుభ సూచకమని ఆలయ కమిటీ బాధ్యులు, పూజారులు తెలిపారు. దీంతో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు.

క్షీరాభిషేకం



నర్సంపేట : పట్టణంలోని అంబేడ్కర్ సెంటర్‌లో డీబీడీపీఎస్ ప్రజా దండోరా ఆధ్వర్యంలో శుక్రవారం సీఎం రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి చిత్రపటాలకు శుక్రవారం క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ప్రజా దండోరా జాతీయ అధికారులు అందె రవి మాట్లాడారు. సుప్రీంకోర్టు తీర్పుకు అనుగుణంగా ఎస్సీ వర్గీకరణపై ముసాయిదా బిల్లును రాష్ట్ర ప్రభుత్వం ఆమోదించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి హామీ మేరకు మార్చి 6న క్యాబినెట్ సమావేశంలో ఎస్సీ వర్గీకరణ ముసాయిదా బిల్లు ఏర్పాటు చేశారని చెప్పారు. రానున్న అసెంబ్లీ సమావేశాల్లో బిల్లు పెట్టి చట్టం తీసుకురావాలని నిర్ణయించడం అభినందనీయమని తెలిపారు. కార్యక్రమంలో డీబీడీపీఎస్ ప్రతినిధులు కందిక జయ, కన్నం సంజీవ, రాజు, ఉప్పలయ్య, సది, యాకయ్య, రాజేశ్, రాములు, ఆరోగ్యమ్మ, నిర్మల, విమల, తదితరులు పాల్గొన్నారు.

సన్మానం



నర్సంపేట రూరల్ : మహిళా సంఘాలకు రుణాలు మంజూరు చేయించడంలో ప్రతిభ చూపిన క్రమంలో నర్సంపేట మండల సీసీ యాకూబ్‌ను యూనియన్ బ్యాంక్ మేనేజర్ వినోద్‌కుమార్, డీఆర్‌డీఓ కౌసల్యాదేవి, అడిషనల్ పీడీ రేణుకదేవి, డీపీఎం అనిత సన్మానించారు. శుక్రవారం నిర్వహించిన బ్యాంక్ సమావేశంలో ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో మహిళా సంఘాలకు అందించాల్సిన రుణాలపై సమీక్షించారు. ఈ ఏడాది రూ.12 కోట్ల లక్ష్యం కాగా ఇప్పటివరకు యాకూబ్ రూ.6.50 కోట్లు ఇప్పించగా ఆయన్ను సత్కరించారు.

డైరీ ఆవిష్కరణ

చెన్నారావుపేట : సమాచార హక్కు రక్షణ చట్టం-2005 జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ క్లాపు ప్రణీత్ ఆధ్వర్యంలో నూతన సంవత్సర డైరీని స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఎస్సై రాజేశ్‌రెడ్డి శుక్రవారం ఆవిష్కరించారు. అనంతరం ఎస్సై మాట్లాడారు. ప్రజలందరూ సమాచార హక్కు చట్టంపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సహ చట్టం జిల్లా మీడియా కన్వీనర్ క్లాపు గణేశ్ పాల్గొన్నారు.

పాత కక్షలతో దాడి

పర్వతగిరి : పాత కక్షలతో మండల కేంద్రానికి చెందిన గూడెల్లి పద్మ, ఆమె కుమారులు రంజిత్, వెంకటేశ్‌లపై దాడి జరిగింది. ఈ ఘటన శుక్రవారం చోటుచేసుకుంది. ఎస్సై బోగం ప్రవీణ్ కథనం ప్రకారం.. పద్మ, ఆమె తోటి కోడళ్లు అత్త ఉప్పలమ్మ బాగోగులు చూసుకోవడానికి మాట్లాడతామని వచ్చి మూకుమ్మడిగా దాడి చేశారు. మామునూరుకు చెందిన కానిస్టేబుల్‌తోపాటు కట్ట భిక్షపతి, కట్ట భూపాల్, మంద రవితేజ తమ ఇంటిపై ఇటుకలతో దాడి చేయగా తాము గాయాల పాలైనట్లు రజిత ఫిర్యాదు చేసింది. చంపుతామని బెదిరించారని బాధితురాలు వాపోయారు. దాడి చేసిన వారితో ప్రాణహాని ఉందని ఫిర్యాదులో పేర్కొనగా కేసు నమోదు చేసి పద్మను, ఆమె కుమారులను చికిత్స కోసం వరంగల్‌లోని ఎంజీఎం ఆస్పత్రికి పంపించినట్లు ఎస్సై తెలిపారు.

విషాదం

వర్ధన్నపేట : మండలంలోని ఇల్లందకు చెందిన నిమ్మనబోయిన రమేశ్ (38) రోడ్డు ప్రమాదంలో గాయపడి మృతి చెందడంతో గ్రామంలో విషాదం నెలకొంది. రమేశ్ ఐనవోలు మండలంలోని పంథిని గ్రామ శివారులో శుక్రవారం గుర్తు తెలియని వాహనం ఢీకొనగా ఆస్పత్రిలో చేర్చారు. అనంతరం ఆయన పరిస్థితి విషమించి మృతి చెందాడు. మృతుడి తల్లిదండ్రులు కన్నీరు మున్నీరయ్యారు.

పరామర్శ

నర్సంపేట : చెన్నారావుపేట మండలంలో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన భానోతు ఈర్య, భానోతు బుజ్జమ్మ, ఆంగోతు రాములమ్మలను పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ గోగుల రాణాప్రతాప్‌రెడ్డి శుక్రవారం పరామర్శించారు. అనంతరం ఆయన మాట్లాడారు. మృతి చెందిన భూక్య సుక్యా కుటుంబాన్ని, క్షతగాత్రులను ఎక్స్‌గ్రేషియా అందించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

ఊపందుకున్న 'ఉపాధి' పనులు

- ఫాంపాండ్స్, కందకాల తవ్వకాలు
- పని ప్రదేశాల్లో వసతులు కరువు
- మండుటెండలో కూలీలకు ఇబ్బందులు



గుంటూరుపల్లిలో ఫాంపాండ్ తవ్వుతున్న కూలీలు



కృష్ణానగర్‌లో మట్టి రోడ్డు పనులు..

సంగెం : మండలంలో మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పనులు ఊపందుకున్నాయి. వరినాట్లు, ఇతర వ్యవసాయ పనులు తగ్గుముఖం పట్టడంతో ప్రజలు ఉపాధి హామీ పనులకు ఆసక్తి చూపుతున్నారు. మండల పరిధిలో 10600 జాబ్ కార్డులుండగా 20500 మంది కూలీలున్నారు. ఇందులో జాబ్ కార్డులు కలిగిన 7640 కుటుంబాల్లోని 13265 మంది పనులకు హాజరవుతున్నారు. ప్రస్తుతం 1027 మంది పని డిమాండ్ కోసం దరఖాస్తులు చేసుకోగా 875 మంది పనులకు హాజరవుతున్నారు. కూలీల సంఖ్య పెంచేందుకు అధికారులు అవగాహన కల్పిస్తున్నారు. కూలీలకు నెలలు గడిచినా డబ్బులు జమ కాకపోతుండడంతో పనులకు మొగ్గు చూపడం లేదని తెలుస్తోంది. వారానికోసారి ఖచ్చితంగా కూలి చెల్లిస్తే కూలీల సంఖ్య గణనీయంగా పెరిగే అవకాశం ఉందని అధికారులు సైతం వ్యాఖ్యానిస్తున్నారు.

వివిధ రకాల పనులు..

ఉపాధి హామీ పథకంలో భూగర్భ జలాలు పెంపొందించేలా ఫాంపాండ్స్, పొలాలకు బాటలు, మట్టి రోడ్లు, వ్యవసాయ భూముల్లో కందకం పనులు, మొక్కల పెంపకం, కొత్త ఫీడర్ ఛానల్ల నిర్మాణం, భూమి చదును వంటి పనులు చేపడుతున్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం పనులు చేసినా రోజుకు సుమారు కేవలం రూ.300 మాత్రమే కూలి గిడుతున్న పరిస్థితి నెలకొంది.

వారానికోసారి కూలి చెల్లించాలి



గ్రామాల్లో సరైన వ్యవసాయ పనులు లేక ఉపాధి హామీ పనులకు వెళ్తున్నాం. కాగా 25 రోజులుగా కూలి రాలేదు. డబ్బులు చెల్లించక పోతే కుటుంబాలను ఎలా పోషించుకోవాలి. వారానికోసారి ఖచ్చితంగా కూలి చెల్లించాలి. పని ప్రదేశాల్లోనూ తాగునీటి, నీడ, ఇతర వసతులు లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. అనారోగ్యం బారిన పడితే ప్రథమ చికిత్స అందించే కిట్లు కూడా లేవు.

- ఎర్రల సుజాత, కూలీ, వెంకటాపూర్

పనులను వినియోగించుకోవాలి



పని ప్రదేశాల్లో గ్రామ పంచాయతీలు వసతులు కల్పించాలి. నిబంధనల ప్రకారం పని చేస్తే కూలి గిడుతుంది. జాబ్ కార్డులున్న వ్యక్తులు పనులను సద్వినియోగం చేసుకోవాలి. అన్ని గ్రామాల్లో కూలీ సంఖ్య పెరగాలి. వారానికోసారి కూలి అందేలా చొరవ తీసుకుంటాం. పని దినాలు, చెల్లింపులు, ఇతర విషయాలపై ఏవైనా అనుమానాలుంటే నేరుగా యాప్‌లో ఫిర్యాదు చేస్తే న్యాయం జరుగుతుంది.

- గణేశ్, ఏపీఓ, సంగెం

జన్‌మన్‌రేగా యాప్‌తో అక్రమాలకు చెక్

జాతీయ ఉపాధి హామీ పథకంలో అక్రమాలకు చెక్ పెట్టేందుకు కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. పలు చోట్ల ఉపాధి పనుల్లో అక్రమాలు చోటు చేసుకుంటున్నట్లు విమర్శలుండడంతో కేంద్ర ప్రభుత్వం జన్‌మన్‌రేగా పేరుతో ఒక ప్రత్యేక యాప్‌ను తీసుకొచ్చింది. ఈ యాప్ ద్వారా కార్యాలయాలకు వెళ్లకుండా సెల్‌ఫోన్‌లోనే కూలీల వివరాలు తెలుసుకునే అవకాశం ఉంది. పనులు మరింత పారదర్శకంగా జరగనున్నాయి.

పని ప్రదేశాల్లో వసతులు కరువు

మార్చి ప్రారంభం నుంచే ఎండలు ముదురుతున్నాయి. ఈ క్రమంలో పని ప్రదేశాల్లో కూలీలకు తాగునీటి, నీడ, ప్రథమ చికిత్స కిట్లు, తదితర వసతులు కల్పించిన దాఖలాల్లేవు. కూలీలు సమీపంలోని చెట్ల నీడనే సేద తీరుతున్న పరిస్థితి నెలకొంది.

ప్రణాళికతో చదివితే సత్ఫలితాలు

- జీసీడీఓ ఫ్లోరెన్స్



విద్యార్థులతో మాట్లాడుతున్న జీసీడీఓ ఫ్లోరెన్స్

ఖానాపురం : ప్రణాళికతో చదివితే సత్ఫలితాలు సాధించడం ఖాయమని గర్ల్ చైల్డ్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ (జీసీడీఓ) ఫ్లోరెన్స్ స్పష్టం చేశారు. మండలంలోని అశోక్‌నగర్ కేజీబీవీని శుక్రవారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులతోపాటు స్టోర్ రూమ్, వంట గది, కంప్యూటర్ ల్యాబ్‌లను ప్రత్యక్షంగా పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడారు. ఉత్తమ ఫలితాల సాధనే లక్ష్యంగా చదువుకోవాలని సూచించారు. ఆరోగ్యాన్ని ఏమాత్రం నిర్లక్ష్యం చేయొద్దన్నారు. టెన్త్, ఇంటర్ విద్యార్థులు నూరు శాతం ఫలితాలు సాధించాలని చెప్పారు. చదువులో వెనకబడిన విద్యార్థులను గుర్తించి ప్రత్యేక తరగతులు నిర్వహిస్తూ వారు సైతం ముందడుగు వేసేలా చొరవ చూపాలని అధ్యాపకులను ఆదేశించారు. కార్యక్రమంలో ఎస్‌ఓ మేనక, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యల పరిష్కారమే ధ్యేయం



సంగెం : ట్రాన్స్‌ఫార్మర్‌కు మరమ్మతు చేయిస్తున్న ఏడీఈ నర్సింహారావు, అధికారులు

- ఏడీఈ నర్సింహారావు

సంగెం : పంటల సాగులో రైతులకు ఎదురయ్యే విద్యుత్ సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పొలం బాట కార్యక్రమం చేపడుతున్నట్లు ఆ శాఖ ఏడీఈ నర్సింహారావు తెలిపారు. మండలంలోని గవిచర్లలో పొలంబాట కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ భూముల్లోని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు, స్తంభాలు, తదితరాలను పరిశీలించి సమస్యలను పరిష్కరించారు. అనంతరం ఏడీఈ నర్సింహారావు మాట్లాడారు. పొలం బాటలో భాగంగా రైతుల వ్యవసాయ బావుల వద్ద ఉన్న విద్యుత్ సమస్యలకు పరిష్కారం లభిస్తుందని చెప్పారు. రైతులు తప్పనిసరిగా విద్యుత్ పంపు సెట్లకు కెపాసిటర్లు బిగించుకోవాలని సూచించారు. ఓవర్‌లోడ్, విద్యుత్ సరఫరాలో హెచ్చుతగ్గులు, లూజ్‌లైన్లు, తదితర సమస్యల అడిగి తెలుసుకున్నారు. విద్యుత్ సమస్యలు తలెత్తితే అధికారులకు, సిబ్బందికి సమాచారం ఇవ్వాలని సూచించారు. రైతులు సొంతంగా విద్యుత్ పనులు చేయొద్దని కోరారు. కార్యక్రమంలో ఏఈ అశ్విన్‌కుమార్, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు

పర్వతగిరి : మండలంలోని గోరుగుట్టతండాలో విద్యుత్ సిబ్బంది 25 కేవీ ట్రాన్స్‌ఫార్మర్ స్థానంలో 63కేవీ ట్రాన్స్‌ఫార్మర్ అమర్చారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ వెంకన్ననాయక్ మాట్లాడారు. రైతులు విద్యుత్ సమస్యతో ఇబ్బంది పడుతుండగా అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో 63 కేవీ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేశారని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు రమేశ్, బాదావత్ మోహన్, మోహన్ నాయక్, రవీందర్, శ్రీనివాస్, సుధాకర్, వెంకటేశ్, అనిల్, తదితరులు పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి



వర్ధన్నపేట : బహుమతి అందజేస్తున్న సీఐ

- ఎక్సైజ్ సీఐ స్వరూప

వర్ధన్నపేట : మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని ఎక్సైజ్ శాఖ సీఐ స్వరూప ఆకాంక్షించారు. పట్టణంలోని ఫ్రస్కోస్ స్కూల్‌లో శుక్రవారం నిర్వహించిన మహిళా దినోత్సవ వేడుకలకు ఆమె ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. దేశం శాస్త్ర, సాంకేతిక రంగాల్లో దూసుకుపోతున్న ప్రస్తుత తరుణంలోనూ మహిళలు విద్య, వైద్యం, ఉద్యోగం, ఉపాధి, ఇతర రంగాల్లో కొంత వెనుకబడి ఉన్నారని చెప్పారు. మహిళలు పురుషులకు దీటుగా ముందుకు సాగాలని సూచించారు. తొలుత ఫుడ్ ఫెస్టివల్‌ను నిర్వహించారు. అనంతరం వ్యాసరచన పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాల్లో ప్రతిభ చాటిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డైసీ, కరస్పాండెంట్ మేరీ అంటోనీ, జెన్నిఫర్, వల్సా, తదితరులు పాల్గొన్నారు.



సంగెం : మాట్లాడుతున్న ఎంపీడీఓ రవీందర్

చైతన్యంతోనే సాధికారత

సంగెం : మహిళలు చైతన్యవంతులైనే సాధికారత సాధించినట్లని ఎంపీడీఓ కాసర్ల రవీందర్ స్పష్టం చేశారు. మండల పరిషత్ కార్యాలయంలో సర్వోదయ యూత్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మహిళల సంక్షేమానికి అనేక పథకాలు అమలు చేస్తున్నాయని చెప్పారు. మహిళలు సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా ఎదగాలని ఆకాంక్షించారు. డాక్టర్ క్రాంతి మాట్లాడుతూ లింగ నిర్ధారణ చట్టరీత్యా నేరమని చెప్పారు. ఎస్సై నరేశ్ మాట్లాడుతూ పిల్లలను తల్లిదండ్రులు పర్యవేక్షించాలని సూచించారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ ఓంప్రకాశ్, సీహెచ్‌ఓ చిన్నా బాయి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఈశ్వరి, సంస్థ ఉద్యోగులు ఇందిర, వనిత తదితరులు పాల్గొన్నారు.

కొమ్మాల ఈఓకు 10 ఆలయాల బాధ్యతలు



గీసుకొండ : మండలంలోని కొమ్మాల లక్ష్మీనర్సింహస్వామి ఆలయ ఇన్‌చార్జ్ కార్యనిర్వహణ అధికారి (ఈఓ) అద్దంకి నాగేశ్వర్‌రావు వరంగల్, హనుమకొండ జిల్లాల్లోని 10 ఆలయాలకు ఇన్‌చార్జ్ ఈఓగా విధులు నిర్వర్తిస్తున్నారు. హనుమకొండ జిల్లా వేలేరు మండలం మల్లికుదుర్లలోని గట్టు మల్లికార్జునస్వామి, ఐనవోలు మల్లికార్జునస్వామి, అగ్రంపహాడ్ సమ్మక్క-సారలమ్మ, వరంగల్ జిల్లా వర్ధన్నపేట ఇల్లంద రాజరాజేశ్వరస్వామి, గొర్రెకుంట కట్టమల్లన్నస్వామి, అబ్బనికుంట మైసమ్మ తల్లి, వరంగల్ జేపీఎన్ రోడ్డులోని శ్రీఆంజనేయస్వామి, నేరెళ్ల సత్రం, భద్రకాళి సమీపంలోని అయ్యప్ప, తదితర 10 ఆలయాలకు ఇన్‌చార్జ్‌గా కొనసాగుతున్నారు. జిల్లాలో 16 మందికి గాను కేవలం 8 మంది ఈఓలు ఉన్నారని తెలుస్తోంది. మరో ఐదు నెలల్లో ఐదుగురు ఉద్యోగ విరమణ చేయనున్నారు. ఇలాంటి పరిస్థితిలో ఆలయాలకు ఇన్‌చార్జ్ ఈఓలను నియమించారు.

కంపాస్ బాక్స్‌ల అందజేత

నల్లబెల్లి : మండలంలోని రుద్రగూడెం పాఠశాలలో 8, 9వ తరగతుల విద్యార్థులకు పూర్వవిద్యార్థి, డిగ్రీ కళాశాల ప్రొఫెసర్ గుగులోతు రాజు శుక్రవారం కంపాస్, జామెట్రికల్, 3డీ నమూనా బాక్స్‌లు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని కోరారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ హెచ్‌ఎం రాజిరెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గ్రామాల్లో ఎస్ఆర్ఆర్ ఫౌండేషన్ సేవలు

రాయపర్తి : మండలంలోని గ్రామాల్లో ఎస్ఆర్ఆర్ ఫౌండేషన్ చైర్మన్, బీఆర్ఎస్ జిల్లా నాయకుడు పరుపాటి శ్రీనివాస్‌రెడ్డి సహకారంతో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు మాజీ జెడ్పీటీసీ రంగు కుమార్ తెలిపారు. మండలంలోని మైలారంలోని రామాలయంలో సీసీ బెడ్ నిర్మాణ పనులను, కాట్రపల్లిలో పీరెమ్మల మజీద్ (ఆసర్‌ఖానా) నిర్మాణ పనులను శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కులమతాలకు అతీతంగా సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమాల్లో ఫౌండేషన్ ప్రతినిధులు లేతాకుల రంగారెడ్డి, యాకూబ్, సైదులు తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నర్సంపేట/దుగ్గొండి : నర్సంపేట, దుగ్గొండి మండలంలోని రేకంపల్లి సబ్‌స్టేషన్లలో మరమ్మతుల నేపథ్యంలో నేడు విద్యుత్ అంతరాయం కలుగనుందని ఏఈలు విజయభాస్కర్‌రావు, ప్రత్యూష శుక్రవారం వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు. నర్సంపేటలో ఉదయం 8.30 నుంచి 10 గంటల వరకు, దుగ్గొండి మండలం రేకంపల్లి పరిధిలో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు. దుగ్గొండి మండలంలోని గిర్నిబావి సెంటర్‌లో కొత్తగా పోల్స్ వేయడంతోపాటు ఫీడర్ల వద్ద మరమ్మతులు చేపట్టాల్సి ఉందని వివరించారు. విద్యుత్ వినియోగదారులు, రైతులు సహకరించాలని కోరారు.

జనరిక్ మందులు నాణ్యమైనవే



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న డాక్టర్ సరోజ

చెన్నారావుపేట : జనరిక్ మందులు నాణ్యమైనవేనని స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ సరోజ తెలిపారు. జన ఔషధీ దివస్‌ను పురస్కరించుకుని మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. మల్టీ నేషనల్ కంపెనీలు తయారు చేసే మందులు, జనరిక్ మందుల తయారీలో పాటించే ఫార్ములా ఒక్కటేనని చెప్పారు. తక్కువ ధరలో లభించే జనరిక్ మందులను వినియోగించుకుని ఆర్థిక భారం తగ్గుతుందని తెలిపారు. కార్యక్రమంలో డీపీఎంఓ జయరాం, సీహెచ్‌ఓ భద్రయ్య, హెల్త్ ఎడ్యుకేటర్ వసంత, సూపర్‌వైజర్ రామెల్, స్టాఫ్ నర్సులు ఎస్తేర్, హేమలత, ఫార్మసిస్ట్ లీలారాణి, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా స్వయం పరిపాలన దినోత్సవం



చెన్నారావుపేట : విద్యార్థులతో హెచ్‌ఎం, ఉపాధ్యాయులు



ఖానాపురంలో..

వర్ధన్నపేట/చెన్నారావుపేట/ఖానాపురం : వర్ధన్నపేట మండలంలోని కడారిగూడెంలోని, చెన్నారావుపేట మండలంలోని కోనాపురంలోని, ఖానాపురం మండలంలోని మనుబోతులగడ్డలోని ప్రభుత్వ పాఠశాలల్లో శుక్రవారం ఘనంగా స్వయం పరిపాలన దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా పాఠశాలల విద్యార్థులు డీఈఓ, హెచ్‌ఎం, ఉపాధ్యాయులుగా వ్యవహరించి ఆకట్టుకున్నారు. అనంతరం ప్రతిభ చాటిన విద్యార్థులకు హెచ్‌ఎంలు బహుమతులు అందజేసి అభినందించారు. కార్యక్రమాల్లో హెచ్‌ఎంలు శ్రీనివాస్, అశోక్, ఉపాధ్యాయులు ఆంజనేయులు, సుష్మ, శ్రీలక్ష్మి, ప్రత్యూష, కార్తీక్, నౌషీన్, వాగ్య, వీరన్న, వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

జీపీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

సాక్షి నెట్‌వర్క్ : గ్రామ పంచాయతీ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి అబ్బుదాసి అశోక్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆ యూనియన్ ఆధ్వర్యంలో చెన్నారావుపేట, సంగెం, దుగ్గొండి, ఖానాపురం మండలాల్లోని మండల పరిషత్ కార్యాలయాల్లో ఎంపీడీఓ, ఇతర అధికారులకు శుక్రవారం వినతిపత్రాలు వేర్వేరుగా అందజేశారు. ఈ సందర్భంగా అశోక్ మాట్లాడారు. బకాయిలు విడుదల చేయడంతోపాటు గ్రీన్ చానల్ ద్వారా వేతనాలు చెల్లించాలని, సిబ్బందిని 2వ పీఆర్‌సీ పరిధిలోకి తీసుకోవాలని, ఇతర సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమాల్లో యూనియన్ ఉపాధ్యక్షుడు వెంగళ శ్రీను, మండల కార్యదర్శులు సుమన్, ఉస్మాన్ బాషా, భిక్షపతి, నాయకులు నాయకులు వల్లెం సుధన్‌రెడ్డి, నరేందర్, వెంకటేశ్వర్లు, జన్ను రమేష్, కంచె దూడయ్య, తుమ్మలపెల్లి ఎల్లమ్మ, వెంకటమ్మ, ప్రసన్న, పార్వతి, సోమక్క, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నుంచి ఇద్దరి సస్పెన్షన్

- పార్టీ మండల అధ్యక్షుడు శ్రీనివాస్



సమావేశంలో మాట్లాడుతున్న కొమురారెడ్డి

గీసుకొండ : కాంగ్రెస్‌లో గ్రూపులు కడుతున్న క్రమంలో మండల కేంద్రానికి చెందిన వీరగోని రాజ్‌కుమార్, మనుగొండకు చెందిన అల్లం మర్రెడ్డిలను మండల సమన్వయ కమిటీ నిర్ణయం మేరకు పార్టీ నుంచి సస్పెండ్ చేస్తున్నట్లు పార్టీ మండల అధ్యక్షుడు తుమ్మనపెల్లి శ్రీనివాస్ తెలిపారు. మండలంలోని ఎలుకుర్తి హవేలీలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి భీమగాని సౌజన్య, పరకాల నియోజకవర్గ అధికార ప్రతినిధి చాడ కొమురారెడ్డిలతో కలిసి శ్రీనివాస్ మాట్లాడారు. రాజ్‌కుమార్, మర్రెడ్డి పార్టీలో ఉంటూనే బీజేపీ, బీఆర్ఎస్‌లతో లోపాయికారీ ఒప్పందాలు కుదుర్చుకున్నట్లు తెలిపారు. పార్టీకి నష్టం కలిగిస్తున్నారని చెప్పారు. ఇక నుంచి ఆ ఇద్దరితో పార్టీకి సంబంధం లేదన్నారు. అనంతరం పార్టీ పరకాల నియోజకవర్గ అధికార ప్రతినిధి కొమురారెడ్డి మాట్లాడారు. పార్టీ కోసం పాటుపడే శ్రేణులకు పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి తప్పనిసరిగా ప్రాధాన్యత ఇస్తారని వివరించారు. కొమ్మాల జాతరలో పార్టీ మండల కమిటీ ఆధ్వర్యంలో ప్రభ బండి కడతామని తెలిపారు. సమావేశంలో పార్టీ సమన్వయ కమిటీ సభ్యుడు దూల వెంకటేశ్వర్లు, మాజీ ఎంపీటీసీ మణిగోపాల్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ అకుల రుద్రప్రసాద్, నాయకులు రవీందర్, కూసం రమేశ్, సాంబరెడ్డి, గొర్రె రాజు, నల్ల సురేశ్, లడే రాజు, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

నర్సరీల్లో షేడ్ నెట్‌లు ఏర్పాటు చేయాలి

- ఎంపీడీఓ శంకర్‌నాయక్



నర్సరీలో మొక్కలను పరిశీలిస్తున్న అధికారులు

పర్వతగిరి : మండలంలోని అన్ని నర్సరీల్లోనూ మొక్కల రక్షణకు షేడ్ నెట్‌లు ఏర్పాటు చేయాలని ఎంపీడీఓ మాలోతు శంకర్‌నాయక్ సిబ్బందిని ఆదేశించారు. మండలంలోని శ్రీనగర్, గోరుగుట్టతండా, సోమారం, పర్వతగిరి, కల్లెడ గ్రామపంచాయతీల్లోని నర్సరీలను శుక్రవారం ఆయన సందర్శించి సిబ్బందికి సూచనలు అందించారు. రోజూ ఉదయం 7లోపు సాయంత్రం 5 గంటల తర్వాత అన్ని బ్యాగ్‌లు తడిచేలా నీరు పట్టాలని సూచించారు. గ్రామాల్లో కనీసం 60 మంది కూలీలు ఉపాధి పనికి హాజరు కావాలని చెప్పారు. లేబర్ రిపోర్టు తక్కువ ఉన్న గ్రామాల్లో ఫీల్డ్ అసిస్టెంట్లు, పంచాయతీ కార్యదర్శులు, టెక్నికల్ అసిస్టెంట్లపై శాఖాపరమైన చర్యలు తప్పవన్నారు. కార్యక్రమంలో ఈసీ రాజు, పంచాయతీ కార్యదర్శులు దయాకర్, రఘు, మాధవుడు, తదితరులు పాల్గొన్నారు.

బిట్స్‌లో లోకమాత అహిల్యాబాయి జయంతి



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ శ్రీనివాస్

నర్సంపేట రూరల్ : నర్సంపేట మండలంలోని లక్నేపల్లి శివారులోని బాలాజీ ఇంజనీరింగ్ కళాశాలలో అఖిల భారతీయ రాష్ట్రీయ శైక్షిక మహాసంఘ్ ఆధ్వర్యంలో లోకమాత అహిల్యాబాయి హోల్కర్ 300వ జయంతి వేడుక శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా డాక్టర్ శ్రీనివాస్ హాజరై ప్రసంగించారు. ప్రఖ్యాత అహిల్యాబాయి సంస్కరణలు వివరించారు. తొలుత అహిల్యాబాయి చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో బాలాజీ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ రాజేంద్రప్రసాద్‌రెడ్డి, కళాశాలల ప్రిన్సిపాల్స్ హరిహరన్, సంపత్, శ్యాంసుందర్, భాను రేఖ, డీన్‌లు నారాయణ, కరుణ, ఏఓ సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

'పోడు' హక్కుపత్రాలు అందించడంలో నిర్లక్ష్యం

ఖానాపురం : అర్హులైన పోడు రైతులకు హక్కుపత్రాలు అందించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఎంసీపీఐ(యూ) జిల్లా కార్యదర్శి పెద్దారపు రమేశ్ విమర్శించారు. మండలంలోని అశోక్‌నగర్‌లో శుక్రవారం నిర్వహించిన పార్టీ ముఖ్యకార్యకర్తల సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. అనేక ఏళ్లుగా వ్యవసాయమే జీవనాధారంగా పని చేసుకుంటున్న రైతులకు అటవీ హక్కుల చట్టం ప్రకారం పత్రాలు ఇవ్వకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నారని ధ్వజమెత్తారు. రాజకీయాలకు అతీతంగా పోడు రైతులకు న్యాయం చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలన్నిటినీ అమలు చేయడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మోసపూరితంగా వ్యవహరిస్తున్నాయని విమర్శించారు. సమావేశంలో పార్టీ మండల కార్యదర్శి కలకోట్ల యాదగిరి, నాయకులు నర్సయ్య, రాఘవరావు, గోపాల లక్ష్మి, యాకయ్య, నర్సయ్య, ఎల్లమ్మ, రాజేందర్, తదితరులు పాల్గొన్నారు.